# ప్రశాంతి

## ఎన్. భవాని

**పూజచేసాడా తమ కోసం? ఆమె ఒక నిర్ణయానికొచ్చినట్లుగా గబగబా పర్స్‌లోంచి ఒక వంద రూపాయలు తీసి ఇచ్చి, అతన్ని పరీక్షచేసి మందులిచ్చి పంపేసింది. ఆమె మనసంతా ఆరోజు కలత కలతగానే చెదిరిపోయింది.**

"సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం"

"మంచి" సహచర్యంలో మనిషి బాంధవ్యాలను పెంచుకోడు. భ్రమలు కల్పించుకోడు" "విశ్వలా! విశ్వలా!" తల్లి అరుపులను విని విశ్వల 'టక్'మని టేప్‌రికార్డర్ ఆఫ్ చేసి అలాగే కుర్చీలో ఎవరో హిప్నొటైజ్ చేసినట్లు కూర్చుండిపోయింది.

స్వామి రంగనాథానంద స్పీచ్ నిజంగా ఎంత మహత్తరమైనది! ఇంతమంచి జ్ఞానం రావాలంటే కేవలం భక్తిమార్గంలోనే లభ్యమౌతుందేమో! ప్చ్! పుట్టుక చరితార్థం కావాలంటే ఇలాంటి బ్రతుకు బ్రతకాలి. అప్పుడే—

"కొత్తగా వెనుకవీధిలో వెంకటేశ్వరస్వామి గుడికట్టారట. కాస్త తోడు వస్తావుటే" చీర సర్దుకుంటూ విశ్వలతల్లి బయటకు వచ్చింది.

అప్పుడే కేసెట్‌లో దాగిన భక్తి ప్రవాహాన్ని గొంతువరకు త్రాగిన విశ్వల వెంటనే బయలుదేరింది. దారి పొడుగునా ఆమె ఆ కేసెట్‌లోని భావాంతరాల్ని తనకున్న అనుభవాలతో పోల్చి ఆలోచించుకుంటోంది. గుడి బయటి వాతావరణమే మనసు అని దేవుడు మనుషులకి మాత్రమే ఇచ్చిన వరాన్ని పులకరింపచేసే విధంగా వుంది. గుడిలో పూజచేస్తున్న అర్చకుడిని చూసి నవ్వువచ్చింది విశ్వలకు. పదహారేళ్ళ మానసిక వృద్ధాప్యాన్ని సంతరించుకుని అన్ని ఐహిక ఆకర్షణలను క్షణికంగా అణిచిపెట్టి ఏదో పెద్ద అరిందాలాగా వచ్చిన వాళ్ళకు అక్షింతలు, తీర్థం, ప్రసాదం ఇస్తూ వుంటే ముగ్ధంగా అన్పించింది విశ్వలకు.

సహస్రనామార్చన మొదలుపెట్టాడు అతను. చుట్టూ వున్న వారు బహుశ గుడి పెద్దలేమో, వీళ్ళు వంత కలిపి పలకసాగారు. మధ్యలో చిన్నగా నాలుక అడ్డుపడి పొరమారింది అతనికి. అంతే! భయం భయంగా అటూ ఇటూ పద్యం ఆపేసి చూసాడు. ఒక భారీ విగ్రహం "ఒళ్ళు దగ్గరగా పెట్టుకుని చదవడం నేర్చుకో. అయినా చిన్న వెధవ్వి పూజ చేతకాదు అంటే విన్నావా? ఏదో మా అసలు పూజారికి ఒళ్ళు బాలేక నిన్ను పెట్టిస్తే ఇలా తగలెడుతున్నావ్" రంకె వేసినట్లుగా అన్నాడు. అతను తిరిగి తలదించుకుని చదవసాగాడు జాగ్రత్తగా. 'పాపం'! అన్పించింది విశ్వలకు.

పూజా కార్యక్రమం అయిపోయాక అందరికీ హారతి ఇచ్చి షడగోపురం పెడుతూ హారతి పళ్ళెం పట్టాడు. అందరు వేసిన చిల్లరను నెమ్మదిగా హుండీలో అందరి ఎదుటా వేయసాగాడు. అలా వేస్తుండగానే అసలే భయంతో వున్నాడేమో చెయ్యి వొణికి ఒక పదిపైసల నాణెం కిందపడింది. అయిపోయింది తన పని! అని మనసులోనే నిర్ణయించేసుకున్నాడు. చుట్టూ నిలబడిన జనం ఒకొక్కరు ఒక్కోరకంగా తిట్టసాగారు. "పాపం చేయటం మన పని, క్షమించటం దేవుడి కర్తవ్యం" అజ్యంపోస్తూ వెకిలిగా నవ్వాడు ఒకతను. "పూజారులు ఏం చేసినా ఫరవాలేదండోయ్, వాళ్ళకు పాపానికి లైసెన్సుంది." అతనికి తల తీసేసినట్లుగా వుంది. వీళ్ళ సూటిపోటి మాటలకి. విశ్వల ఇక అక్కడ నిలబడలేనట్లుగా బయటకు వచ్చి అరుగుమీద కూర్చుండిపోయింది.

అన్యమనస్కంగా ఇల్లు చేరిన విశ్వలకు గుడికివెళ్ళిన ఆనందం స్థానంలో అర్థం తెలియని ఏదో అవ్యక్తకలత ఆవరించింది. అంత చిన్న కుర్రాడు అందరిలా, తమ కొడుకులతోపాటు అనుభవించాల్సిన వయసును దేవుడికి అంకితం చేసిన ఘనతను హర్షించలేకపోగా అతన్ని ఎందుకిలా బాధించారు? తమ గొప్పతనాన్ని అందరి భక్తుల ముందు చాటుకోవాలనా? లేక ఒళ్ళు పొగరుతో నిండిపోయా? ఏంటో!

లేచి గబగబా ముస్తాబు చేసుకుని ముందర రూమైన తన క్లినిక్‌లో కూర్చుంది. రోగుల సన్నిధిలో కాసేపు జరిగిన సంఘటన మర్చిపోదామని. ఎవరో లోపలకు వస్తున్న చప్పుడై చదువుతున్న బుక్ మూసి తలెత్తింది. ఆమె ఆశ్చర్యంతో "మువ్వా" అంది.

"నమస్కారం" అతను ఆమెకెదురు కుర్చీలో కూర్చున్నాడు. "అదేంటి! రాత్రి తొమ్మిందింటి వరకు గుడి వుంటుంది కదా! మరి వదిలేసి ఇలా వచ్చావేంటి?'' ' అతను వచ్చిన సంగతిని మరిచి అడిగింది.

"నేనే మానేసానండి" తలవంచుకుని చెప్పాడు.

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగింది.

"హుండీకి వాళ్ళు తాళం వేయటం మర్చిపోయారు మీరు నిన్న రాత్రి. ఈ రోజు చూసుకుంటే లెక్క తక్కువొచ్చిందని నాపై అభాండం వేసారు" అతని గొంతు బొంగురుపోయింది. ఆమె వింతగా చూస్తోంది.

"అసలు... అసలు... ఈ గుళ్ళో ఒప్పుకోవడమే బుద్ధి తక్కువండి! నా తమ్ముడికి ఉపనయనం చేద్దామని మూడురోజులకు యాభైరూపాయలిస్తానంటే ఒప్పుకున్నాను. కానీ ఏమీ ఇవ్వకుండానే పంపేసారు" వెక్కిళ్ళతో అన్నాడు.

విశ్వల గుండె తరుక్కుపోయింది. ఇంత చిన్న కుర్రాడిపై అలా ప్రవర్తించడం మానవత్వం కాదనిపించింది. వాళ్ళను తల్చుకుంటేనే అసహ్యమేస్తోంది. "నాకు రెండురోజులనుంచి బాగా జ్వరంగా వుంది డాక్టరమ్మా! కొంచెం ఏమైనా మందులివ్వండి"

అంటే... అంటే...జ్వరంతోనే అరగంట నిలబడి పూజచేసాడా తమ కోసం. ఆమె ఒక నిర్ణయానికొచ్చినట్లుగా గబగబా పర్స్‌లోంచి ఒక వంద రూపాయలు తీసి ఇచ్చి, అతన్ని పరీక్షచేసి మందులిచ్చి పంపేసింది. ఆమె మనసంతా ఆరోజు కలత కలతగానే చెదిరిపోయింది.

అమెరికాకు వెళ్ళటం చిన్న పిల్లల దృష్టిలో ఓ అద్భుతం అయితే పెద్దవాళ్ళకు ఒక పచ్చని కల. కానీ నిజంగానే వెళ్ళే అవకాశం వస్తే ఒకవైపు పట్టలేని ఆనందంతోపాటు మరోవైపు కొద్దిపాటి దుఃఖం కూడా మొదలవుతుంది. అలాగే విశ్వలకు తన భర్తతోపాటు అమెరికాలోని అట్లాంటాకు వెళ్ళటం కొద్దిపాటి బాధాకరంగా వుంది.


కొద్దిరోజుల్లోనే ఆమె అక్కడి వాతావరణానికి అలవాటు పడిపోయింది. చుట్టూరా వున్న క్రైస్తవ విదేశీయులతోపాటు చర్చికి వెళ్ళటం, ప్రార్థనలు నేర్చుకోవడం, అందరినీ ఆహ్వానించటం చేస్తోంది.

"విశ్వలా... విశ్వలా... ఇవాళ మనింటికి ఒక ఇండియన్ ఫ్రెండ్ వస్తున్నాడు. అతను ఈ ప్రక్కింట్లో మకాం పెడుతున్నాడు తెల్సా" వినోద్ సంతోషంగా చెప్పాడు.

విశ్వలకు ఆరోజు సంక్రాంతిలా అన్పించింది. ఊరుకానీ ఊర్లో మన తెలుగువాళ్ళు కన్పిస్తే రాళ్ళల్లో రత్నం దొరికినట్లుగా వుంటుంది. అతన్ని ఆహ్వానించటానికి అన్ని ఏర్పాట్లు చేసి వుంచుకున్నారు భార్యాభర్తలు. వాకబు చేయగా తెల్సింది అతను తమ వీధిలోని చర్చికి ఆర్నెల్లపాటు అతిథిగా ఆహ్వానింపబడ్డాడని. క్రైస్తవ బోధలను ప్రచారం చేయటానికి. ఒక దేశంనుంచి మరొక దేశంకు క్రైస్తవ ప్రచారకులు ఇలా వలస వెళ్ళటం మామూలే.

"రండి! రండి" సాదరంగా ఆహ్వానిస్తూ అతడిని లోపలకు తీసుకువచ్చాడు వినోద్. పూలు సర్దుతున్న విశ్వల ఆనందంగా తల తిప్పి నవ్వుతూ పలకరించబోయింది. అంతే తెరిచిన ఆమె నోరు అలాగే వుండిపోయింది.

ఆరేళ్ళక్రితం తన దగ్గర వైద్యం కోసమొచ్చిన



పదహారేళ్ళ పూజారి!

''నువ్వు... నువ్వు... క్రైస్తవ మతం... ఆమెకు మాట పెగలడంలేదు. అతను చిన్నగా నవ్వాడు. ఆ నవ్వులో అతనుగతంలో అనుభవించిన ఆకలి, నిరుద్యోగం, పేదరికం తాలూకు ఛాయలు విలయతాండవం చేసినట్లుగా అన్పించింది ఆమెకు.

అతనికి అన్నం వడ్డిస్తున్నంతసేపు అతను వేసుకున్న ఖరీదైన బట్టలు, వాటి తాలూకు పెర్‌ఫ్యూమ్, చేతిపై వజ్రాలతో పొదిగిన రిస్టువాచీ, బూట్లు... ఇవన్నీ చూసే కొద్దీ అతనిపై అంచెలంచెలుగా అంతులేని అసహ్యం, ఏహ్యాభావం కలుగుతోంది ఆమెకు. ఛీ... ఛీ... డబ్బుకు గడ్డి తిని అమృత పాత్రలాంటి బ్రాహ్మణ కులాన్ని విసర్జించి కేవలం... కేవలం... సుఖాల కోసం మతం మార్చుకున్న పతితుడు!

మర్నాడు కాలింగ్ బెల్ మ్రోగడంతో చదువుతున్న నవల పక్కనపెట్టి లేచి వెళ్ళి తలుపుతీసింది. అతనే! ఆమె అయిష్టంగా లోపలకు ఆహ్వానించింది. అతను నిర్మొహమాటంగా వచ్చి సోఫాలో కూర్చున్నాడు. కొద్దిగా తలవంచుకుని ''నిన్న మీరు చూసిన చూపు నా మనసును కాల్చేస్తోంది. దానికి అర్థం నాకు తెలుసు. అందుకే కారణం చెప్పాలనుకుని వచ్చాను..''

''అక్కర్లేదు'' అతను పూర్తిచేయకుండానే అంది. ఆమె మనసు మండుతోంది.

''యస్యమతం తస్యమతం, మతం యస్యన వేదన'' .. అన్నాడు. ఆమె ఆశ్చర్యంగా చూసింది. అతను వెంటనే ''నా కుటుంబం నడవటానికి నా అర్చకత్వం ఏ మాత్రం సాయం చేయలేకపోయింది. అందుకే బాప్టిసమ్ తీసుకుని, అందులోనే ఉపాసన చేసి చర్చికి ఫాదర్ అయ్యాను'' ఆమె కొంచెం సర్దుకుంది.

''మరి పెళ్ళి?'' అమాయకంగా అడిగింది.

''పెళ్ళి సమాజ ఆమోదం, మన సుఖానికి. అది నాకిష్టంలేదు. అంటే...? ఆమె ప్రశ్నార్థకంగా చూసింది.

''నా గమ్యం మతం కాదు. భక్తి! మీకిష్టమని ఈ క్యాసెట్ తెచ్చాను. తీసుకోండి'' అతను క్యాసెట్ ఇచ్చి లేచి మౌనంగా వెళ్ళిపోయాడు.

ఆమె మెదడు మొద్దుబారినట్లుగా వుంది. యాంత్రికంగా లేచి వెళ్ళి క్యాసెట్ పెట్టి రికార్డర్ ఆన్ చేసింది. కళ్ళుమూసుకుని కుర్చీకి ఆనుకుంది.

''మనసా! ఇక కావలసిన సుఖమున నుండవదేమే? అఖిలాండకోటి బ్రహ్మాండనాథుడే అంతరంగమున నెలకొని యుండగా....!''

కమ్మని సుపరిచిత కంఠం ఆమెను మేల్కొల్పింది. కళ్ళు తెరిచి చూసేసరికి ఎదురుగా కన్పిస్తున్న చిన్నికృష్ణుని ఫోటో వెక్కిరిస్తున్నట్లుగా అన్పించింది! *